ప్రజాతీర్పు 2024

II | హైదరాబాద్, శనివారం 4 మే 2024 | నమస్తే తెలంగాణ | www.ntnews.com

అభ్యర్థులకు 48 గంటల్లోగా నో డ్యూ సర్టిఫికెట్

రాష్ట్రాలకు ఈసీ ఆదేశం

న్యూఢిల్లీ: ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులకు 'నో డ్యూ సర్టిఫికెట్ల'ను వారు దరఖాస్తు చేసినప్పటి నుంచి 48 గంటల్లోగా జారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఎన్నికల కమిషన్ (ఈసీ) ఆదేశించింది. నామినేషన్ పత్రాలతోపాటు నో డ్యూ సర్టిఫికెట్‌ను సమర్పించకపోతే, అభ్యర్థి నామినేషన్‌ను తిరస్కరించే అవకాశం ఉన్నందు వల్ల ఈ ఆదేశాలను జారీ చేసింది. నామినేషన్ల దాఖలుకు గడువు పూర్తయిన తర్వాత ఈ సర్టిఫికెట్‌ను సమర్పించినప్పటికీ ప్రయోజనం ఉండదని గుర్తు చేసింది. అభ్యర్థి పోటీ చేసే అవకాశాన్ని కోల్పోవడం వల్ల ఆ అభ్యర్థికి మాత్రమే కాకుండా, రాజకీయ పార్టీలకు, ఓటర్లకు కూడా నష్టం జరుగుతుందని తెలిపింది.

బేటీ బచావో ఇదేనా?

- ప్రచారానికే పరిమితమైన బీజేపీ నినాదం
- లైంగికదాడి నిందితులకు పార్టీ అండదండలు
- ప్రజ్వల్ రేవణ్ణ సెక్స్ స్కాండల్‌పై ముందే తెలిసినా జేడీఎస్‌తో పొత్తు
- బ్రిజ్‌భూషణ్ కుమారుడికి లోక్‌సభ టికెట్
- బిల్కిస్ రేపిస్టుల విడుదల, సన్మానాలు
- కథువా, హత్రాస్ నిందితులకు మద్దతు
- మణిపూర్ మహిళలపై దారుణాలపై మౌనం

న్యూఢిల్లీ, మే 3: 'బేటీ బచావో.. బేటీ పఢావో'.. కేంద్రంలోని మోదీ సర్కారు ఇచ్చిన నినాదమిది. అయితే స్వయంగా బీజేపీనే ఈ నినాదానికి నిలువునా తూట్లు పొడుస్తున్నది. లైంగికదాడి నిందితులకు ఆ పార్టీ అండగా నిలుస్తున్నది. ఇటీవల పరిణామాలు దీన్ని రుజువు చేస్తున్నాయి. జేడీఎస్ నేత ప్రజ్వల్ రేవణ్ణ సెక్స్ స్కాండల్ గురించి కమలం పార్టీకి ముందే తెలిసినా, లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీతో పొత్తు పెట్టుకున్నది. రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న బ్రిజ్‌భూషణ్ కుమారుడికి లోక్‌సభ టికెట్ ఇచ్చింది.

ప్రజ్వల్ వ్యవహారం ముందే తెలిసినా..

లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రజ్వల్.. జేడీఎస్ పార్టీకి చెందిన వ్యక్తి అయినప్పటికీ, ఆయన బీజేపీ కూటమిలో భాగంగా హసన్ ఎంపీగా పోటీచేశారు. ప్రజ్వల్ సెక్స్ స్కాండల్ వ్యవహారం బీజేపీకి ముందే తెలుసునని, ఆ పార్టీకి చెందిన నేత ఒకరు గత ఏడాది డిసెంబర్‌లోనే హెచ్చరించినప్పటికీ అధిష్ఠానం పట్టించుకోలేదనే ప్రచారం జరుగుతున్నది. మరోవైపు లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని మోదీ గత నెల 14న మైసూర్‌లో జరిగిన ర్యాలీలో ప్రజ్వల్ రేవణ్ణతో వేదిక పంచుకొన్నారు.

బ్రిజ్‌భూషణ్ సింగ్‌పై చర్యలేవి?

డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడిగా ఉన్న బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ సింగ్‌పై మహిళా రెజ్లర్లు చేసిన లైంగిక వేధింపుల ఆరోపణలు దేశవ్యాప్తంగా పెద్ద సంచలనమే రేపాయి. దీనిపై పలువురు ప్రముఖ రెజ్లర్లు ఢిల్లీలో ఆందోళన కార్యక్రమాలు కూడా చేపట్టారు. అయినా బ్రిజ్‌భూషణ్‌పై బీజేపీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఉత్తరప్రదేశ్‌లోని కైసర్‌గంజ్ లోక్‌సభ సీటు అభ్యర్థిత్వాన్ని ఇన్ని రోజులుగా నాన్చిన బీజేపీ.. ఇప్పుడు ఆ స్థానాన్ని బ్రిజ్‌భూషణ్ కుమారుడు కరణ్ భూషణ్ సింగ్‌కు కేటాయిస్తూ గురువారం ప్రకటించింది.

రేపిస్టును కలిసిన బీజేపీ ఎంపీ

యూపీలోని ఉన్నావోలో 17 ఏండ్ల బాలికపై సామూహిక లైంగిక దాడి కేసులో బీజేపీ ఎమ్మెల్యే కుల్దీప్ సింగ్ సెంగార్ 2018లో అరెస్టు అయ్యాడు. 2019లో ట్రయల్ కోర్టు అతనికి జీవిత ఖైదు విధించింది. అయితే అంతకుముందు ఆరోపణలు ఎదుర్కొంటున్న సమయంలో ఎమ్మెల్యే సెంగార్‌పై బీజేపీ చర్యలు తీసుకోకపోవడంపై పెద్దయెత్తున విమర్శలు వచ్చాయి. మరోవైపు 2019 లోక్‌సభ ఎన్నికల తర్వాత జైల్లో ఉన్న సెంగార్‌ను బీజేపీ ఎంపీ సాక్షి మహారాజ్ కలిశారు.

నిందితుడికి మద్దతుగా ఆందోళనలు

జమ్ముకశ్మీర్‌లోని కథువాలో 8 ఏండ్ల బాలికపై జరిగిన లైంగిక దాడి హత్య కేసులో నిందితుడైన పోలీసు అధికారి దీపక్ ఖజూరియాను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ 2018లో బీజేపీ నేతలు ఆందోళన చేపట్టారు. అప్పటి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయ్ శర్మ కూడా ఈ ర్యాలీలో పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా హత్రాస్ ఘటన

యూపీలోని హత్రాస్‌లో 19 ఏండ్ల దళిత యువతి అగ్రవర్ణానికి చెందిన వ్యక్తుల చేతుల్లో సామూహిక లైంగిక దాడి, హత్యకు గురైంది. అయితే ఈ ఘటనలో బాధిత యువతి మృతదేహాన్ని రాష్ట్ర ప్రభుత్వం హడావుడిగా, బాధిత కుటుంబసభ్యులు లేకుండానే రాత్రికి రాత్రే దహనం చేయించింది.

బీజేపీ నేత రిసార్టులో యువతి హత్య

2022, సెప్టెంబర్‌లో ఉత్తరాఖండ్‌లో అంకిత్ భండారి అనే 19 ఏండ్ల యువతిని బీజేపీ నేత వినయ్ ఆర్య కుమారుడు పుల్కిత్ ఆర్య ఓ రిసార్టులో హత్య చేసినట్టు వచ్చిన ఆరోపణలు సంచలనంగా మారాయి. అయితే ఈ కేసులో పోలీసుల దర్యాప్తు తీరుపై మహిళా హక్కుల సంఘాలు ప్రశ్నలు లేవనెత్తాయి.

బిల్కిస్ బానో రేపిస్టుల విడుదల

2022లో గుజరాత్ ప్రభుత్వం బిల్కిస్ బానో రేపిస్టులను విడుదల చేసింది. ఈ కేసులో దోషులుగా నిర్ధారణ అయిన 11 మందిని కేంద్ర హోంశాఖ అనుమతి తీసుకొనే రెమిషన్‌పై విడుదల చేసినట్టు రాష్ట్ర సర్కార్ 2022, అక్టోబర్‌లో సుప్రీంకోర్టుకు తెలిపింది. అయితే గుజరాత్ ప్రభుత్వ ఉత్తర్వులను సుప్రీంకోర్టు ఈ ఏడాది జనవరిలో కొట్టివేసింది.

మణిపూర్ ఘటనలపై నిర్లక్ష్యం

మణిపూర్‌లో మహిళల నగ్న ఊరేగింపు, లైంగిక దాడి ఘటన జరిగి ఏడాది అయింది. ఈ ఘటనలో బాధితులు తమను కాపాడాలని పోలీసుల వద్దకు వెళ్తే.. వాళ్లే మహిళలను మూకకు అప్పగించారని సీబీఐ చార్జిషీట్‌లో పేర్కొన్నది. అయితే గత ఏడాది మే 3న మణిపూర్‌లో హింసాకాండ ప్రారంభం కాగా.. దేశ ప్రధానిగా ఉన్న మోదీ 78 రోజుల తర్వాతకు గానీ నోరు విప్పలేదు. ఇప్పటికీ ఆయన రాష్ట్రంలో పర్యటించలేదు.

ఏడీఆర్ నివేదిక ప్రకారం..

మహిళపై నేరాల కేసుల్లో బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు- 44

ఎన్సీఆర్బీ గణాంకాల ప్రకారం..

దేశవ్యాప్తంగా మహిళలపై నేరాలు

2014- 3,37,922

2022- 445,256

పెరుగుదల- 31 శాతం

సకాలంలో పోలింగ్ శాతాలు ప్రకటిస్తాం

విపక్షాల విమర్శలపై ఈసీ స్పందన

న్యూఢిల్లీ, మే 3: లోక్‌సభ ఎన్నికల తుది పోలింగ్ శాతాలను వెల్లడించడంలో జరుగుతున్న జాప్యంపై విపక్షాలు చేస్తున్న విమర్శలకు కేంద్ర ఎన్నికల సంఘం స్పందించింది. రానున్న ప్రతి దశ తర్వాత ఓటింగ్ శాతాల గణాంకాలను సకాలంలో వెల్లడించేందుకు కట్టుబడి ఉన్నామని శుక్రవారం పేర్కొన్నది. ఓటింగ్ ముగిసిన వెంటనే పోలింగ్ కేంద్రాల వారీగా 'పోలైన వాస్తవ ఓట్ల సంఖ్య'కు సంబంధించిన డాటా అభ్యర్థుల వద్ద అందుబాటులో ఉంటుందని తెలిపింది. అయితే తొలి దశ ఎన్నికలు జరిగిన 11 రోజులకు పోలింగ్ శాతాన్ని ప్రకటించడానికి గల కారణంపై ఈసీ స్పష్టత ఇవ్వలేదు. లోక్‌సభ తొలి దశ ఏప్రిల్ 19, రెండో దశ ఏప్రిల్ 26 జరుగ్గా.. ఆ రెండు దశలకు సంబంధించి తుది ఓటింగ్ శాతాలను ఈసీ 30న విడుదల చేసింది. అయితే ఎన్నికలు జరిగిన ఆయా రోజుల్లో ప్రకటించిన ఓటింగ్ శాతాలకు, ఇన్ని రోజుల ఆలస్యంగా విడుదల చేసిన తుది ఓటింగ్ శాతాలకు భారీ తేడా ఉండటంపై ప్రతిపక్ష పార్టీలు అనుమానాలు వ్యక్తం చేశాయి.

'పేర్లు కలిశాయని పోటీ వద్దంటే ఎలా?'

న్యూఢిల్లీ: ఒకే పేరున్న వ్యక్తులు ఎన్నికల్లో పరస్పరం పోటీచేయకుండా నిరోధించాలన్న పిటిషన్‌ను విచారణకు స్వీకరించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఇతర రాజకీయ నాయకుల పేర్లతో ఉన్న వ్యక్తులు స్వతంత్రంగా ఎన్నికల్లో పోటీచేయకుండా నియంత్రించలేమని స్పష్టం చేసింది. ఎవరైనా రాహుల్ గాంధీ అనో లేక లాలూ ప్రసాద్ యాదవ్ అనో పేర్లు పెట్టుకుంటే ఎన్నికల్లో పోటీచేయకుండా వారిని ఎలా ఆపగలం? అది వారి హక్కులను కాలరాయడం కాదా?' అని ప్రశ్నించింది.

ఒక్కో నెత్తిపై లక్ష అప్పు

బీజేపీ హయాంలో అప్పుల కుప్పగా భారత్

- మోదీ సర్కారు రుణాలు రూ. 97 లక్షల కోట్లు
- మొత్తంగా దేశం అప్పులు రూ. 155 లక్షల కోట్లు
- నెలకు చెల్లించే మిత్తి దాదాపు 90 వేల కోట్లు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ): కేంద్రంలోని బీజేపీ సర్కారు వల్ల భారత్ అప్పుల కుప్పగా మారింది. కేంద్ర ఆర్థిక శాఖ విడుదల చేసిన నివేదిక ప్రకారం.. మార్చి 31, 2023 వరకూ కేంద్రం రూ.155.6 లక్షల కోట్ల అప్పులు చేసింది. ఇందులో 30 శాతం వరకూ దీర్ఘకాలిక రుణాలు ఉన్నాయి. 2014కు ముందు కేంద్రం చేసిన అప్పు రూ.58.6 లక్షల కోట్లు కాగా, మోదీ ప్రధాని అయిన తర్వాత తొమ్మిదేండ్లలో చేసిన అప్పు రూ.97 లక్షల కోట్లకు పైగా ఉన్నది. అప్పటి ప్రధానులు ఏడాదికి సగటున రూ.84 వేల కోట్ల అప్పులు చేస్తే, మోదీ ఏకంగా నెలకే దాదాపు రూ.93 వేల కోట్ల అప్పులు చేశారు. అసమర్థ విధానాలతో దేశ ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేసిన బీజేపీ ప్రభుత్వం.. దాన్ని కప్పిపుచ్చుకోవడానికి ఒకవైపు ఎడాపెడా అప్పులు చేయడమే కాదు.. పేద, మధ్యతరగతి వర్గాలకు ఇస్తున్న సబ్సిడీలు తగ్గించింది. అంతటితో ఆగకుండా వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలపై వాత పెడుతున్నది. దీంతో నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి.

	మార్చి 31, 2014	మార్చి 31, 2023
దేశ జనాభా	130 కోట్లు	140 కోట్లు
కేంద్రం అప్పు	రూ. 58.6 లక్షల కోట్లు	రూ. 155.6 లక్షల కోట్లు
ఒక్కో నెత్తిపై అప్పు	రూ. 45 వేలు	రూ. 1.2 లక్షలు
జీడీపీలో అప్పు వాటా	52 శాతం	57.5 శాతం
విదేశీ రుణం	3.74 లక్షల కోట్లు	7.48 లక్షల కోట్లు

నెల మిత్తి రూ. 90 వేల కోట్లు

చేసిన అప్పులకు గానూ కేంద్రం పెద్దయెత్తున వడ్డీలు చెల్లిస్తున్నది. 2014-15లో తీసుకొన్న రుణాలకు రూ.4.02 లక్షల కోట్లను వడ్డీగా చెల్లించగా, 2021-22లో రూ.8.14 లక్షల కోట్లు, 2022-23 ఆర్థిక సంవత్సరం రూ.9.4 లక్షల కోట్లను చెల్లించింది. 2023-24 ఆర్థిక సంవత్సరం రూ.10.8 లక్షల కోట్లను వడ్డీగా చెల్లించనున్నట్టు సమాచారం. ఈ లెక్కన ప్రతినెల రూ.90 వేల కోట్ల చొప్పున కేంద్రం వడ్డీల రూపంలో చెల్లిస్తున్నది.



పదేండ్ల బీజేపీ హయాంలో పెరుగుదల..

జనాభా 7.69% | రుణం 166% | ఒక్కో నెత్తిపై అప్పు 144% | విదేశీ అప్పు 100% | జీడీపీలో అప్పు వాటా 9.8%

మోదీ సర్కారు అప్పు ఇలా..

సెకనుకు	3.4 లక్షలు
నిమిషానికి	2.07 కోట్లు
గంటకు	124.7 కోట్లు
రోజుకు	2,993 కోట్లు
నెలకు	89,814 కోట్లు
సంవత్సరానికి	10.7 లక్షల కోట్లు
9 ఏండ్ల పాలనలో	97 లక్షల కోట్లు

ప్రజ్వల్, రేవణ్ణలపై రేప్ కేసు

- తన తల్లిని లైంగికంగా వేధించారని మైసూరు యువకుడి ఫిర్యాదు
- ప్రజ్వల్ మూడేండ్లుగా లైంగిక దాడి చేస్తున్నాడన్న మరో మహిళ

రేవణ్ణ

ప్రజ్వల్

మైసూరు, మే 3: జేడీ(ఎస్) ఎమ్మెల్యే రేవణ్ణ, ఆయన కొడుకు ప్రజ్వల్‌పై మైసూరు పోలీసులు గురువారం రాత్రి కిడ్నాప్, లైంగిక దాడి కేసు నమోదు చేశారు. తన తల్లిని వారు అపహరించారని రాజు అనే వ్యక్తి చేసిన ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కర్ణాటక హోం మంత్రి పరమేశ్వర కథనం ప్రకారం.. ఫిర్యాదుదారుడి తల్లి ఆరేండ్ల క్రితం రేవణ్ణ ఇంట్లో పనిచేశారు. మూడేండ్ల క్రితం ఆమె పని మానేసి సొంతూరికి తిరిగి వచ్చారు. అయితే 5 రోజుల క్రితం రేవణ్ణ అనుచరుడైన సతీశ్ బాబన్న రాజు ఇంటికి వచ్చి పోలీసులు వచ్చి విచారణ చేస్తారని.. వారికి ఎలాంటి వివరాలు చెప్పకూడదని.. చెప్తే నువ్వు జైలుకు కూడా వెళ్లాల్సి వస్తుందని రాజును బెదిరించాడు. ఆ తర్వాత రాజు తల్లిని బైక్‌పై గుర్తు తెలియని ప్రదేశానికి తీసుకెళ్లాడు. ఇటీవల వైరల్ అయిన సెక్స్ స్కాండల్ వీడియోలో రాజు తల్లిపై ప్రజ్వల్ లైంగిక దాడి చేసిన దృశ్యాలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో తన తల్లి ప్రాణాలకు హాని ఉందని..ఆమెపై లైంగిక దాడి చేశారని రాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

తుపాకీతో బెదిరించి లైంగిక దాడి

హసన్ ఎంపీ రేవణ్ణ మూడేండ్లుగా తనపై లైంగిక దాడి చేస్తున్నాడని హసన్ జిల్లా పంచాయత్ మాజీ సభ్యురాలు (44)ఒకరు బుధవారం సీఐడీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాను జెడ్పీ సభ్యురాలిగా ఉన్న సమయంలో 2021లో ఒకసారి ప్రజ్వల్ ఇంటికి ఒక పని మీద వెళ్లినప్పుడు తనపై లైంగిక దాడి చేశాడని ఆమె తెలిపారు. 'సందర్శకులంతా వెళ్లిపోయాక ప్రజ్వల్ నన్ను ఓ గదిలోకి లాక్కెళ్లి డోర్ లాక్ చేశాడు. నా భర్త రాజకీయంగా ఎదగాలంటే నేను ఆయన(ప్రజ్వల్) చెప్పినట్టు వినాలని అన్నాడు. ఆ తర్వాత నాపై లైంగిక దాడికి యత్నించాడు. నేను ప్రతిఘటిస్తే తుపాకీతో కాల్చేస్తానని బెదిరించి నాపై లైంగిక దాడి చేశాడు. ఆ ఘటనను ప్రజ్వల్ తన ఫోనులో వీడియో తీసుకున్నాడు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఆ వీడియో లీక్ చేస్తానని బెదిరించాడు. ఇలా బెదిరిస్తూ నాపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. తరచూ ఫోన్ చేసి నగ్నంగా తనతో మాట్లాడాలని ఒత్తిడి చేసేవాడు' అని ఆ మహిళ ఆవేదన వ్యక్తం చేశారు.

గాంధీజీ ఓ జిత్తులమారి

కాబోయే మహాత్ముడు రాహుల్

కాంగ్రెస్ నేత వివాదాస్పద వ్యాఖ్య

రాజ్‌కోట్, మే 3: జాతిపిత మహాత్మా గాంధీపై గుజరాత్ కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే ఇంద్రాణి రాజ్‌గురు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. గాంధీని జిత్తులమారిగా అభివర్ణించిన ఆయన గాంధీ కంటే రాహుల్ గాంధీ ఎంతో మెరుగని, ఆయన స్వచ్ఛమైన మనసుతో ఔదార్యంతో ఉంటారని అన్నారు. రాబోయే రోజుల్లో ఆయన మహాత్మునిగా అపతరించడం ఖాయమని పేర్కొన్నారు. మహాత్మునిపై ఇలాంటి వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్‌ను ప్రజలు క్షమించబోరని గుజరాత్ బీజేపీ ఉపాధ్యక్షుడు భరత్ బొగ్గరా విమర్శించారు.

పాండియన్ సతీమణిపై బదిలీ వేటు

భువనేశ్వర్: బీజేడీ నేత వీకే పాండియన్ సతీమణి సుజాత ఆర్ కార్తికేయన్‌పై ఎన్నికల కమిషన్ (ఈసీ) బదిలీ వేటు వేసింది. మిషన్ శక్తి డిపార్ట్‌మెంట్‌లో కమిషనర్ కమ్ సెక్రటరీగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆమెను.. రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శిగా బదిలీ చేసింది. ప్రభుత్వ కార్యాలయాన్ని దుర్వినియోగం చేస్తున్నారని బీజేపీ ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఈసీ ఈ నిర్ణయం తీసుకున్నది. ప్రజలతో సంబంధం లేని శాఖకు ఆమెను బదిలీ చేసింది.

మోదీ, షా మౌనమేల?

బెంగాల్ గవర్నర్‌పై లైంగిక ఆరోపణలపై స్పందించరేం?

- సీఎం మమతా బెనర్జీ నిలదీత
- రాజ్‌భవన్‌లో పోలీసుల ప్రవేశంపై గవర్నర్ ఆనందబోస్ నిషేధం

కాంగ్రెస్ ఒక ప్రకటనలో డిమాండ్ చేసింది.

కోల్‌కతా, మే 3: పశ్చిమబెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద బోస్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు రాజకీయ దుమారం రేపుతున్నాయి. తనపై గవర్నర్ లైంగిక వేధింపులకు పాల్పడ్డారని రాజ్‌భవన్ మహిళా ఉద్యోగి ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేయడం రాష్ట్రంలో ప్రకంపనలు సృష్టిస్తున్నది. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షాపై సీఎం మమతా బెనర్జీ విరుచుకుపడ్డారు. పర్బా బర్దమాన్‌లో శుక్రవారం జరిగిన ఎన్నికల సభలో ఆమె మాట్లాడుతూ 'గవర్నర్ లైంగిక దాడిపై రాజ్‌భవన్ మహిళా ఉద్యోగి కన్నీటి గాథ నా హృదయాన్ని ముక్కలు చేసింది. నేను ఆమె వీడియోను చూశా.. ఆమె భాధను అర్థం చేసుకున్నా. గురువారం రాత్రి రాజ్‌భవన్‌కు వచ్చిన ప్రధాని మోదీ దీనిపై ఎందుకు మౌనంగా ఉన్నారు' అని మమత ప్రశ్నించారు. తల్లులు, చెల్లుల గౌరవం గురించి ఉపన్యాసాలు దంచే మీరు దీనిపై స్పందించరా? అని ఆమె నిలదీశారు. 'రాజ్‌భవన్‌లో షాకింగ్ విషయాలు తెలిశాయి. మరికొంత మంది మహిళలపై కూడా ఇలాగే వేధింపులకు పాల్పడ్డారు. 'నారీ కా సమ్మాన్' నినాదంలో చిత్తశుద్ధి ఉంటే ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాలు వెంటనే జోక్యం చేసుకుని బాధిత మహిళలకు న్యాయం చేయాలి' అని తృణమూల్ కాంగ్రెస్ ఒక ప్రకటనలో డిమాండ్ చేసింది.

పోలీసులకు నో ఎంట్రీ

రాజ్‌భవన్ ప్రాంగణంలోకి పోలీసులు, బెంగాల్ మంత్రి భట్టాచార్యకు ప్రవేశాన్ని నిషేధిస్తూ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ కేసులో గవర్నర్‌ను పోలీసులు ప్రశ్నిస్తారన్న అనుమానం, గవర్నర్‌పై ఆరోపణలు వచ్చిన వెంటనే మంత్రి భట్టాచార్య తొలిసారిగా స్పందించడం వల్ల ఈ నిషేధ ఉత్తర్వులు జారీ చేసినట్టు భావిస్తున్నారు. 'అసలు రాజ్‌భవన్‌లో ఏం జరుగుతున్నది? అది కూడా ప్రధాని మోదీ రాష్ట్ర పర్యటనకు వచ్చిన రోజు జరగడం ఏమిటి?' అని భట్టాచార్య నిలదీశారు.

ఇలాంటి ఆరోపణలు ఇంకా రావొచ్చు

ఇలాంటి ఆరోపణలు తనపై ఇంకా రావొచ్చు నని, 1943 నాటి బెంగాల్ కరువుకు, 1846 నాటి కలకత్తా హత్యలకు కూడా తనను నిందించవచ్చునని గవర్నర్ బోస్ శుక్రవారం పేర్కొన్నారు. ఇదొక అసంబద్ధ నాటకంగా వర్ణించిన ఆయన అవినీతిని, రాష్ట్రంలో జరుగుతున్న హింసపై తాను సాగిస్తున్న పోరాటాన్ని ఎవరూ ఆపలేరని అన్నారు.

'కేజ్రీవాల్ మధ్యంతర బెయిల్‌ను పరిశీలిస్తాం'

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ మధ్యంతర బెయిల్ అంశాన్ని పరిశీలిస్తామని ఈడీకి సుప్రీం కోర్టు తెలిపింది. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో తన అరెస్టు, ఈడీ కస్టడీని సవాల్ చేస్తూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం కోర్టు విచారించింది. కేజ్రీవాల్ పిటిషన్‌పై విచారణకు సమయం పట్టే అవకాశం ఉంటే, లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మధ్యంతర బెయిల్ అంశాన్ని పరిశీలిస్తామని ధర్మాసనం పేర్కొన్నది. అయితే, ఈ విషయమై తాము తుది నిర్ణయం తీసుకోలేదని, కేవలం సమాచారం మాత్రం ఇస్తున్నామని ఈడీ తరపు న్యాయవాదికి తెలిపింది. తదుపరి విచారణను మే 7కు వాయిదా వేసింది. ఇదే అంశానికి సంబంధించి మంగళవారం జరిగిన విచారణలో.. ఎన్నికల వేళ కేజ్రీవాల్‌ను ఎందుకు అరెస్టు చేయాల్సి వచ్చిందని ఈడీని కోర్టు ప్రశ్నించిన సంగతి తెలిసిందే.

భూగ్ రాహుల్ భూగ్

మొదటిపేజీ తరువాయి...

అమేథీ అయితే మళ్లీ ఓడిపోతారనే రాయ్‌బరేలీ నుంచి పోటీ చేస్తున్నారని బీజేపీ ఎద్దేవా చేస్తున్నది.

వయనాడ్‌నూ వదిలేసినట్టే !

గత ఎన్నికల్లో రాహుల్ గాంధీని అమేథీలో ప్రజలు ఓడించినా కేరళలోని వయనాడ్ ప్రజలు మాత్రం అక్కున చేర్చుకొని 4.31 లక్షల భారీ మెజారిటీతో గెలిపించారు. ఈసారి వయనాడ్‌లో త్రిముఖ పోటీ నెలకొన్నది. రాహుల్ గాంధీకి సీపీఐ అభ్యర్థి అన్నీ రాజా, బీజేపీ అభ్యర్థి, ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సురేంద్రన్ గట్టి పోటీ ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో వయనాడ్‌లో ఓటమి భయంతోనే రాయ్‌బరేలీ నుంచి కూడా రాహుల్ గాంధీ పోటీ చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. రాజకీయ నేతలు రెండుచోట్ల పోటీ చేయడం పెద్ద తప్పేమీ కాదు కానీ ఈ విషయంలో రాహుల్ గాంధీ వ్యవహారశైలి విమర్శలకు తావిస్తున్నది. వయనాడ్‌లో ఏప్రిల్ 26న ఎన్నికలు పూర్తయ్యాయి. అక్కడ పోలింగ్ పూర్తయ్యే వరకు ఆయన రాయ్‌బరేలీలో పోటీ విషయాన్ని బయట పెట్టలేదు. రెండుచోట్ల పోటీ చేస్తున్నాననే విషయాన్ని ముందే వెల్లడించకుండా ఓట్లు అడగడం వయనాడ్ ప్రజలను మోసం చేయడమే అని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాయ్‌బరేలీలో పోటీ చేయాలనే ఆలోచన రాహుల్‌కు ముందే ఉందని, వయనాడ్‌లో పోలింగ్ అయిపోయే వరకు ఈ విషయాన్ని దాచిపెట్టి ప్రజలకు అన్యాయం చేశారని అన్నీ రాజా విమర్శించారు. వయనాడ్‌లో తన కోసం పని చేసిన కాంగ్రెస్ కార్యకర్తలను రాహుల్ గాంధీ వెర్రివాళ్లను చేశారని సురేంద్రన్ విమర్శించారు. కాగా, రాహుల్ గాంధీ రెండుచోట్ల గెలిస్తే ఒక స్థానానికి రాజీనామా చేయాల్సి ఉంటుంది. అప్పుడు ఏ నియోజకవర్గానికి రాజీనామా చేస్తారో ముందే చెప్పాలని రాహుల్ గాంధీని డిమాండ్ చేస్తున్నారు.

భయపడకు రాహుల్.. పారిపోకు: మోదీ

అమేథీలో ఓడిపోయి వయనాడ్ వెళ్లిన రాహుల్ గాంధీ ఇప్పుడు అక్కడ కూడా ఓడిపోతాడనే భయంతోనే రాయ్‌బరేలీ నుంచి పోటీ చేస్తున్నారని ప్రధాని నరేంద్ర మోదీ విమర్శించారు. వయనాడ్‌లో పోలింగ్ తర్వాత ఓటమి భయంతో 'యువరాజు' మరో స్థానాన్ని వెతుక్కుంటారని తాను ముందే చెప్పానని ఆయన గుర్తు చేశారు. 'భయపడకు, పారిపోకు' అని రాహుల్ గాంధీకి మోదీ హితవు పలికారు. కాగా, అమేథీలో ఎన్నికల బరి నుంచి గాంధీ కుటుంబం తప్పుకోవడం ద్వారా పోలింగ్‌కు ముందే కాంగ్రెస్ పార్టీ అమేథీలో ఓటమిని అంగీకరించిందని కేంద్రమంత్రి, అమేథీ బీజేపీ అభ్యర్థి స్మృతి ఇరానీ విమర్శించారు. వయనాడ్‌కు వెళ్లి అక్కడి ప్రజలను తన కుటుంబసభ్యులుగా రాహుల్ గాంధీ చెప్పుకున్నారని, ఇప్పుడు రాయ్‌బరేలీలో ఏం చెప్తారని ప్రశ్నించారు.

సొంత కారు, ఫ్లాట్ లేదట!

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ యూపీలోని రాయ్‌బరేలీలో నామినేషన్ సందర్భంగా తన ఆస్తులు, అప్పుల వివరాలను ప్రకటించారు. అందులో తెలిపిన వివరాల ప్రకారం రాహుల్ పేరున రూ.20 కోట్లకు పైగా ఆస్తులున్నాయి. అందులో రూ. 4.2లక్షల విలువైన బంగారం కూడా ఉంది. అయితే తన పేరున ఎలాంటి నివాస ఫ్లాట్ కానీ, కారు కానీ లేదని తెలిపారు. ఇక అప్పులు రూ.49,79,184 ఉన్నాయి. చరాస్తులు రూ. 9,24,59,264, స్థిరాస్తులు రూ.11,15,02,598 ఉన్నాయి. రాహుల్ విద్యార్హతలు పరిశీలిస్తే యూనివర్సిటీ ఆఫ్ కేంబ్రిడ్జి, ట్రినిటీ కాలేజీ నుంచి ఎంఫిల్ డిగ్రీ, ఫ్లోరిడాలోని రోలిమ్స్ కాలేజీ నుంచి బ్యాచిలర్ డిగ్రీ అందుకున్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో తనపై 18 కేసులున్నట్టు వెల్లడించారు.

రాయ్‌బరేలీ ఎందుకు ?

వయనాడ్‌లో ఓడిపోయినా కచ్చితంగా గెలిచే స్థానం నుంచి పోటీ చేయాలనే ఆలోచనతోనే రాహుల్ గాంధీ రాయ్‌బరేలీని ఎంపిక చేసుకున్నట్టు కనిపిస్తున్నది. ఇక్కడి నుంచి ఇందిరా గాంధీ మూడుసార్లు, ఆమె భర్త ఫిరోజ్ గాంధీ రెండుసార్లు గెలుపొందారు. 2004, 2009, 2014, 2019లో సోనియా గాంధీ విజయం సాధించారు. ఈసారి సోనియా గాంధీ రాజ్యసభకు ఎన్నిక కావడంతో రాయ్‌బరేలీ బరి నుంచి తప్పుకున్నారు. కచ్చితంగా గెలుస్తాననే నమ్మకంతోనే రాహుల్ గాంధీ రాయ్‌బరేలీని ఎంపిక